క్లుప్తంగా

నేడే వేజండ్లలో ఆయుష్మాన్ భవ



చేబ్రోలు: చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామంలో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య సంరక్షణ కేంద్రం వద్ద హెల్త్ మేళా జరుగుతుందని వేజండ్ల-2 వైద్యాధికారి కొత్తపల్లి బాబురావు శుక్రవారం తెలిపారు. మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ హరీస్ మంగళ, ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు, కమిషనర్ జె.నివాస్, జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఆయుష్మాన్ భవ హెల్త్ మేళాలో ఉచిత చెకప్, వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయటం, టెలీ కన్సల్టేషన్, బీపీ, షుగర్ మొదలైన వ్యాధులకు పరీక్షలు, ఆరోగ్య సంరక్షణ తరగతులను నిర్వహించటం, ఆయుష్మాన్ కార్డులను పంపిణీ చేయటం జరుగుతుందని వైద్యాధికారి బాబురావు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుంటూరు రూరల్: విద్యుత్ శాఖలోని పలు మరమ్మతుల వల్ల నగరంలోని, నగర శివారులోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో శనివారం అంతరాయం కలుగుతుందని వినియోగదారులు గమనించాలని విద్యుత్ శాఖ ఏఈ బ్రహ్మయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవీపీ కాలనీ, శ్రీనివాసరావుతోట, 60 అడుగుల రోడ్డు, కృష్ణబాబు కాలనీ, జోసఫ్‌నగర్, కోదండరామయ్యనగర్, కొత్తకాలనీ, కావేరికాలనీ, కామాక్షినగర్, మిర్చియార్డ్ రోడ్డు, లాలుపురం తదితర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని వినియోగదారులు గమనించాలని సూచించారు.

ఆదర్శనగర్‌లో గణనాథుని నవరాత్రి ఉత్సవాలు



గుంటూరు రూరల్: నగరంలోని ఆదర్శనగర్‌లో గణనాథుని నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భాగంగా గణనాథుని సన్నిధానంలో శ్రీలక్ష్మి అమ్మవారికి సాముహిక కుంకుమార్చనలు చేశారు. భువనగిరి కాంతాయ సిద్ధాంతి ఆధ్వర్యంలో కుంకుమార్చన ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఏపీఆర్ఎస్ఏ కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయండి

గుంటూరు రూరల్: ఉద్యోగులకు ఐక్యతే ఆయుధమని, ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం ద్వారా రెవెన్యూ ఉద్యోగుల ఐక్యతను చాటుదామని ఏపీఆర్ఎస్ఏ గుంటూరు జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని వెస్ట్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సాంబశివరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అక్టోబర్ ఒకటో తేదీన విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్న ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ మండల డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, ఆర్ఐలు గోపి, బాజి, వీఆర్ఓ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆయుబ్, వీఆర్ఓలు, విఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

8న రాజ్యాంగ చర్చా వేదిక ఆవిర్భావ సభ

గుంటూరు ఎడ్యుకేషన్: నగరంలో అక్టోబర్ 8న రాజ్యాంగ చర్చా వేదిక ఆవిర్భావ సభ నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు, న్యాయవాది నడింపల్లి గురుదత్ తెలిపారు. అరండల్‌పేటలోని ఓ హోటల్లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశమంతటా స్వాతంత్య్ర దిన వజ్రోత్సవాల్ని జరుపుకుంటున్న సమయంలో భారత ప్రజాస్వామ్యం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని చెప్పారు. పౌరుల హక్కులు, బాధ్యతలు, రాజ్యాంగ వ్యవస్థల సక్రమ నిర్వహణ, చట్టబద్ధ పాలనకు రాజ్యాంగమే శిరోధార్యమని నమ్ముతూ నూతనంగా ఏర్పాటు చేసిన రాజ్యాంగ చర్చావేదిక ఆవిర్భావ సభను అక్టోబర్ 8వ తేదీ ఉదయం 10 గంటలకు అరండల్‌పేటలోని గీతా రీజెన్సీ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యదర్శి అవధానుల హరి మాట్లాడుతూ భారత రాజ్యాంగం, పౌరుల హక్కులు, బాధ్యతలపై రాజకీయాలకతీతంగా సమాజాన్ని చైతన్యవంతం చేయాలనే లక్ష్యంతో న్యాయవాదులు, డాక్టర్లు, మేధావుల సంయుక్త ఆధ్వర్యంలో రాజ్యాంగ చర్చా వేదిక రూపుదిద్దుకుందని చెప్పారు. ఆవిర్భావ సభకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. మన్మథరావు ముఖ్య అతిథిగా పాల్గొననుండగా, గౌరవ అతిథిగా ప్రొఫెసర్ ఏ. రాజేంద్రప్రసాద్ హాజరు కానున్నారని వివరించారు. కార్యక్రమంలో చర్చా వేదిక సహాయ కార్యదర్శి డాక్టర్ తాతా సేవ కుమార్, ఆడిటర్ పి.వి.మల్లికార్జునరావు, విశ్రాంత వ్యవసాయ శాస్త్రవేత్త జొన్నలగడ్డ రామారావు, కిలారి రాజన్ బాబు, వై.వి.ఎస్. మహదేవ్ పాల్గొన్నారు.

ఇంటింటికీ ఆరోగ్య రక్ష... జగనన్న ఆరోగ్య సురక్ష





మండలంలో తొలి జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసిన వైద్యశాఖ అధికారులు

- నేడు కొప్పురావూరులో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌కు శ్రీకారం
- ప్రత్యేక వైద్య నిపుణులచే వైద్యసేవలు
- గైనకాలజిస్ట్, కంటి వైద్యంతో పాటు అందుబాటులో ఐదుగురు డాక్టర్లు

పెదకాకాని: ప్రభుత్వం రాష్ట్రంలో ప్రతి ఇంటినీ, ప్రతి కుటుంబాన్ని ప్రతి వ్యక్తిని ఆరోగ్యపరంగా సురక్షితంగా ఉంచడమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం(లాంచింగ్) ప్రారంభించారు. జగనన్న ఆరోగ్య సురక్ష మెగా క్యాంపెయిన్ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాల్లో శనివారం ప్రారంభం కానుంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ కార్యక్రమం కొనసాగేలా ఏర్పాట్లు చేశారు. ప్రజల ఆరోగ్య సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని ప్రారంభించడం జరుగుతుంది. అనారోగ్య బాధితులను చేయి పట్టుకొని నడిపించే వ్యవస్థకు నాంది పలికేలా 5 దశల్లో ఉచితంగా ఏడు రకాల వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ క్యాంపులో ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులతో కలిపి మొత్తం నలుగురు డాక్టర్లు వైద్యసేవలు అందించడం జరుగుతుంది. ఇప్పటికే గ్రామాల వారీగా ప్రతి ఇంటిలో ఆరోగ్య సమస్యలు ఉన్న వారిని వలంటీర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, గృహసారథులు, ప్రజా ప్రతినిధులు గుర్తించారు. జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో వైద్యశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పక్కాగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టారు. శనివారం కొప్పురావూరు గ్రామంలో జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌కు ఇంటింటికీ తిరిగి సుమారు 700 మంది వివిధ సమస్యలతో బాధ పడుతున్నట్లు గుర్తించారు. వారందరికీ ఇప్పటికే క్యాంపు నిర్వహించే సమయంతో కూడిన సమాచారం ఇస్తూ టోకెన్లు కూడా అందజేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వెనిగండ్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ రామాంజిరెడ్డి కోరారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ పి.ప్రవీణదీప్తి, డాక్టర్ అనూష, డాక్టర్ భవిష్యలతో పాటు వెనిగండ్ల, పెదకాకాని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు పాల్గొంటారన్నారు. కొప్పురావూరు జిల్లా పరిషత్ పాఠశాలలో హెల్ప్‌డెస్క్, రిజిస్ట్రేషన్ డెస్క్, డాక్టర్ రూము, వైద్య పరీక్షలు, మందులు ఇవ్వడం వంటి ప్రత్యేక డెస్కులు ఏర్పాటు చేయడం జరిగిందని డాక్టర్ వివరించారు.

నేటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు

పొన్నూరు: పొన్నూరు పట్టణ పరిధిలో యూపీహెచ్‌సీలలో, రూరల్ పరిధిలో ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 30న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అక్టోబరు 25 వరకు వైద్య నిపుణులతో మెగా వైద్య శిబిరాలు నిర్వహించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

పొన్నూరు పట్టణంలో శిబిరాలు ఇవే..

- ఈ నెల 30న ఇందిరానగర్ యూపీహెచ్‌సీలో 16,17,18,19,20,21,22,23,24,25,26 వార్డు ప్రజలకు,
- అక్టోబరు 3న జయభారత్‌రెడ్డి నగర్ యూపీహెచ్‌సీలో 5,6,7,8, వార్డులకు,
- అక్టోబరు 4న సాంబశివనగర్ యూపీహెచ్‌సీలో 1,2,3,4,16,17 వార్డులకు వైద్యశిబిరాలు నిర్వహించనున్నారు.
- పొన్నూరు రూరల్‌లో సెప్టెంబరు 30న వెల్లలూరు జెడ్పీహెచ్ఎస్ స్కూలు, అక్టోబరు 4న దొప్పలపూడి ఎంపీపీ స్పెషల్ స్కూల్‌లో, 5న బ్రాహ్మణకోడూరు ఎంపీపీ స్కూల్, 6న సీతారామపురం, ఎస్సీ స్కూల్, 7న మాచవరం ఎంపీపీ మెయిన్ స్కూల్, 9న దండమూడి ఎంపీ యూపీ స్కూల్‌లో, 11న మామిళ్లపల్లి ఎంపీయూపీ స్కూల్లో, 12న పెదపాలెం ఎంపీ యూపీ స్కూల్, 13న ఉప్పరపాలెం ఎంపీ యూపీ స్కూల్‌లో, 16న నండూరు ఎంపీపీ స్కూల్, 19న పచ్చల తాడిపర్రు జెడ్పీహెచ్ఎస్ స్కూల్, 20న మునిపల్లె ఎంపీపీ స్కూలు, 21న ఆరెమండ ఎంపీపీ స్కూల్, 24న ములుకుదురు ఎంపీయూపీ స్కూలు, 25న కసుకర్రు ఎంపీపీ స్కూల్‌లో వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు.



వెల్లలూరులో వైద్య శిబిరం నిర్వహించే స్కూల్‌ను పరిశీలించిన ఎంపీడీఓ శ్రీనివాసరావు

ఆర్‌వీఆర్‌జేసీ కళాశాలలో వరల్డ్ హార్ట్ డే అవగాహన సదస్సు


గుంటూరు రూరల్: ఆధునిక జీవనశైలి, ఒత్తిడి కారణంగా అధిక శాతం మంది గుండె సంబంధిత సమస్యలకు లోనవుతున్నారని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన వరల్డ్ హార్ట్ డే సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒత్తిడిని అధిగమించేందుకు క్రమబద్ధమైన ఆహారం వ్యాయామం అవసరమని, దీనిపై అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 29న ప్రపంచ హృదయ దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతుందన్నారు. డాక్టర్ ఎం బద్రీనారాయణ మాట్లాడుతూ గుండె సంబంధిత సమస్యలు రావడానికి గల కారణాలను తెలియజేశారు. హృద్రోగాల నుంచి రక్షించుకోడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కళాశాల యాజమాన్యం విద్యార్థులు అవగాహన ర్యాలీ, ప్లకార్డుల ప్రదర్శన చేశారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ వరల్డ్ హార్ట్ డే అంతిమ లక్ష్యం హృదయ సంబంధ వ్యాధులను తొలగించడమని తెలిపారు. గుండె మానవ శరీరంలోని ముఖ్యమైన అవయవాలలో ఒకటని, మొత్తం ప్రపంచ మరణాలలో దాదాపు 31% మంది గుండె సంబంధిత సమస్యలతో మరణిస్తున్నారని నివేదికలు పేర్కొంటున్నాయన్నారు. ఒత్తిడిని అదుపులో ఉంచుకొంటూ, వ్యాయామం సైక్లింగ్, మంచి ఆహారాన్ని తీసుకోవడం వలన గుండె సంబంధిత సమస్యలను నివారించుకోవచ్చని కళాశాల ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ ఎం సుధాకర్, డాక్టర్ జీ రామ్‌మోహన్ బాబు, డాక్టర్ రామకోటేశ్వరరావు, డాక్టర్ ఎస్ రాధిక తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న కళాశాల యాజమాన్యం విద్యార్థులు

క్రీడాకారులకు ఆర్థిక చేయూత అవసరం

గుంటూరు వెస్ట్ (క్రీడలు): క్రీడాకారులు విజయాలు సాధించాలంటే వారికి ఆర్థిక తోడ్పాటు ఉండాలని రోటరీ సెంటీనియల్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈ నెల 21 నుంచి 23 వరకు జరిగిన రాష్ట్ర అథ్లెటిక్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులకు జిల్లా అథ్లెటిక్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక చంద్రమౌళీ నగర్‌లోని నాథ్ వెల్‌నెస్ సెంటర్లో అభినందన సభ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ అథ్లెట్స్‌కు తమ సహాయ, సహకారాలుంటాయని తెలిపారు. జిల్లా అథ్లెటిక్ సంఘం జిల్లా కార్యదర్శి జి.వి.ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ మొత్తం 44 మందికి పతకాలు రాగా అందులో 14 మంది జాతీయ పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. రాష్ట్ర పోటీలకు స్పాన్సర్‌షిప్స్ రావడం వల్లే ఈ పతకాలు సాధించారని పేర్కొన్నారు. అనంతరం అథ్లెట్స్‌ను సత్కరించారు. కార్యక్రమంలో నాథ్ వెల్‌నెస్ సెంటర్ చీఫ్ కోచ్ ఎన్.గోపీనాథ్, కోచ్‌లు కె.రవి, బి.కృష్ణారావు, జి.జె. కిశోర్, శివారెడ్డి, సీహెచ్‌వి. రాజు, నాని, సుబ్బారావు పాల్గొన్నారు.



రాష్ట్ర పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు

అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరి


నెహ్రూనగర్: నగరాభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు పాలక వర్గం ప్రతిపాదించిన పనుల్లో నాణ్యత తప్పనిసరని మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు తెలిపారు. తన చాంబర్‌లో శుక్రవారం పనులపై ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముందుగా డివిజన్ల, కాంట్రాక్టర్ల వారీగా పనులు, పురోగతిపై సమీక్ష నిర్వహించారు. పనులు స్థానిక ప్రజా ప్రతినిధుల సూచనల మేరకు నిర్వహించాలని చెప్పారు. నగరాభివృద్ధిలో కాంట్రాక్టర్లు కూడా భాగస్వాములు కావాలని తెలిపారు. టెండర్లు దక్కించుకొన్న వెంటనే త్వరితగతిన పనులు ప్రారంభించి, నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలని కోరారు. సమస్యల్ని తన దృష్టికి తెస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. బిల్లులు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని పలువురు కాంట్రాక్టర్లు సమావేశంలో కోరారు. ప్రాధాన్యతా క్రమంలో ఇప్పించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో ఎస్‌ఈ భాస్కరరావు, ఈఈ సుందర్రామిరెడ్డి, డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.



అధికారులతో సమావేశమైన మేయర్ కావటి మనోహర్‌నాయుడు

జ్వలించే నిప్పు కణిక భగత్ సింగ్

ఏఎన్‌యూ: జ్వలించే నిప్పు కణిక భగత్ సింగ్ అని వీసీ ఆచార్య పి. రాజశేఖర్ అన్నారు. భగత్ సింగ్ జయంతి సందర్భంగా వర్సిటీలోని ఆయన విగ్రహానికి శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆనాటి స్వాతంత్య్ర సంగ్రామంలో భగత్ సింగ్ పోషించిన వీరోచిత పాత్రను యువత గుర్తుంచుకోవాలని చెప్పారు. విద్యార్థులంతా ఆయనలోని దేశభక్తిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రెక్టార్ పి. వరప్రసాద్ మూర్తి, రిజిస్ట్రార్ బి. కరుణ, విశ్వవిద్యాలయ అధ్యాపక సంఘం అధ్యక్షుడు డాక్టర్ బి.నాగరాజు, యూనివర్సిటీ కళాశాలల ప్రిన్సిపాల్స్ సీహెచ్. స్వరూపరాణి, పి. సిద్ధయ్య, జాన్సన్, ఈ. శ్రీనివాసరెడ్డి, కె. సునీత, ఇంజినీర్ కుమార్ రాజా పాల్గొన్నారు.



భగత్ సింగ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ

సమగ్ర వ్యవసాయంతోనే రైతుకు లాభాలు

– వెటర్నరీ డాక్టర్ వీఎఎస్ రాంబాబు

గుంటూరు రూరల్ : ఒకప్పుడు ప్రతి రైతు పంటల సాగుతోపాటు కొన్ని పశువులు, కోళ్ళు, మేకలు, గొర్రెలు పోషిస్తూ ఆనందంగా జీవితాలను గడిపేవారని కడపకు చెందిన వెటర్నరీ డాక్టర్ వీఎఎస్ రాంబాబు తెలిపారు. శుక్రవారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతునేస్తం ఫౌండేషన్‌లో సమగ్ర వ్యవసాయంపై రైతు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ రైతులు తిరిగి పంటల సాగుతోపాటు పశుపోషణ చేపట్టి కోళ్ళు, మేకలు, గొర్రెలు పెంపకాన్ని చేపట్టాలన్నారు. అన్ని మెళకువలు పాటించి గొర్రెలు, మేకల పెంపకం చేపట్టటం వల్ల రైతులకు అదనపు ఆదాయం వస్తుందన్నారు. నందివెలుగు రైతు మీసాల రామకృష్ణ, రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై వేంకటేశ్వరరావులు సేంద్రియ సాగులో దేశీయ జాతి ఆవుల ప్రాముఖ్యత, పశువులకు సంబంధించిన పశుగ్రాసాల గురించి వివరించారు. కూరగాయల సాగు, పుట్టగొడుగుల పెంపకం, తేనెపెట్టెల ఏర్పాటు, వివిధ వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపు విషయాలను అందుకు సంబంధించిన యంత్ర పరికరాలపై ప్రత్యేక శిక్షణ శనివారం అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, రైతునేస్తం ఫౌండేషన్ అధికారులు పాల్గొన్నారు.

కులవృత్తిని సంరక్షించుకోవాలి

నెహ్రూనగర్: ఆధునిక సెలూన్లు ప్రారంభించి క్షవర వృత్తిని సంరక్షించుకోవాలని నాయీ బ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ నరసింహారావు సూచించారు. జేకేసీ కాలేజీ రోడ్డులో రంగ సన్ ఆధునిక సెలూన్ లోగో ఆవిష్కరణ శుక్రవారం నాయీ బ్రాహ్మణ ముఖ్య నాయకుల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులు వృత్తిని దైవంగా భావించి జీవనం సాగిస్తున్న ప్రస్తుత తరుణంలో కార్పొరేట్ సంస్థలు, ధనికవర్గ పెత్తందారులు ప్రవేశించడం దారుణమని ఖండించారు. కోట్ల రూపాయిల పెట్టుబడి పెట్టి బ్యూటీ పార్లర్ పేరుతో సెలూన్ రంగంలోకి ప్రవేశించి, అసలైన నాయీ బ్రాహ్మణ క్షవర వృత్తిదారుల పొట్టకొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సమాజంలో కార్పొరేట్ శక్తులకు దీటుగా నాయీ బ్రాహ్మణులు ఆధునిక సెలూన్లు ఏర్పాటు చేసుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని ఆయన తెలిపారు.

పోషకాహారంతో ఆరోగ్యం పదిలం

మంగళగిరి: పోషకాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ పి. శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. నగర పరిధిలోని ఆత్మకూరులో శుక్రవారం యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో పోషన్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామంలో ఇంటింటికీ వెళ్లారు. పోషకాహార లోపం వల్ల వచ్చే అనారోగ్య సమస్యల్ని గ్రామస్తులకు వివరించారు. పాలు, గుడ్లు, చిరుధాన్యాలు, పండ్లు , కాయకూరలు తీసుకోవడం వల్ల వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న వలంటీర్లను వీసీ డాక్టర్ పార్థసారథి వర్మ, ప్రో వీసీ డాక్టర్ ఏ.వి.ఎస్. ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావుతో పాటు పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.

ప్రజల ఆరోగ్యానికి జగనన్న భరోసా

ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

పొన్నూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదవాడు కార్పొరేట్ వైద్యశాలలకు వెళ్లడానికి భయపడే రోజులు పోయాయని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. జేబులో ఆరోగ్య శ్రీ కార్డు ఉంటే చాలు ఎంత పెద్ద ఆసుపత్రికైనా వెళ్లి చికిత్స చేయించుకోవచ్చనే ధైర్యాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సామాన్యులకు ఇచ్చిందని పేర్కొన్నారు. శుక్రవారం నిడుబ్రోలు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఆయుష్మాన్ భవ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే రోశయ్య, ఐఏఎస్ అధికారులు హర్షమంగళ, డాక్టర్ ఎస్.వెంకటేశ్వరన్, డాక్టర్ రవికిరణ్ పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వానికి, మన జగనన్న ప్రభుత్వానికి మధ్య తేడాను ప్రజలు గ్రహించాలన్నారు. గత టీడీపీ హయాంలో ఇదే సీహెచ్‌సీ వైద్య కేంద్రం అరకొర ఓపీలతో ఒక చిన్న వైద్యశాలలా ఉండేదని, ప్రస్తుతం రోజుకు 250 ఓపీలతో పాటు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. నేటి నుంచి పట్టణం, గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలను ప్రభుత్వం నిర్వహిస్తుందని ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకొని మెరుగైన వైద్య సేవల్ని పొందాలని తెలిపారు. శిబిరంలో ప్రముఖ వైద్య నిపుణులు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం వైద్యులకు ప్రశంసాపత్రాలను ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ కె.సుబ్రహ్మణ్యన్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎ.శ్రావణ్‌బాబు, డాక్టర్ రేష్మ, కమిటీ సభ్యులు కొల్లేరు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



వైద్య సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే రోశయ్య

నంబూరు వీవీఐటీలో ఉద్గమా -2023



వీవీఐటీలో అతిథులను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ వై మల్లికార్జునరెడ్డి



ఉద్గమా కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు కె.ఎస్.సాయిబాబ, తారా సాయికుమార్

పెదకాకాని: స్థిరమైన శక్తికి పునరుత్పాదక విద్యుత్ అవసరం చాలా ఉందని అందులో సౌరశక్తి కీలకమని విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి కె.ఎస్.సాయిబాబ అన్నారు. మండలంలోని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఐఈఈఈ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం సుస్థిరాభివృద్ధి లక్ష్యంలో భాగమైన చౌకగా సుస్థిర శక్తి వనరులు అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య వక్తలుగా విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి కె.ఎస్.సాయిబాబ, ఐఈఈఈ శాక్ సంధానకర్త తారా సాయికుమార్, అంతర్జాలం ద్వారా సింగపూర్‌కు చెందిన ఐఈఈఈ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ దీపక్ వైకర్ హాజరయ్యారు. సాయిబాబ మాట్లాడుతూ భారత దేశంలో జల, సౌర, పవనశక్తి వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. 2050 నాటికి భూమిపై కర్బన్ ఉద్గారాలను సమూలంగా నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు. అణుశక్తి వినియోగం పెరగవలసిన ఆవశ్యకత ఉందని తెలిపారు. ఈ సదస్సులో రాష్ట్ర వ్యాప్తంగా 12 కళాశాలల నుంచి 450 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వై మల్లికార్జునరెడ్డి, డీన్ అకడమిక్ డాక్టర్ డాక్టర్ కె.గిరిబాబు, ఐఈఈఈ గుంటూరు శాఖ సభ్యుడు డాక్టర్ ఉషారాణి, డాక్టర్ స్వర్ణశ్రీ, ప్రోగ్రాం సంధానకర్త ఎంఆర్ఎస్ ఠాగూర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

శలపాడులో గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ

శలపాడు(చేబ్రోలు): రైతు బాంధవుడు, స్వాతంత్య్ర సమరయోధుడు, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. చేబ్రోలు మండలం శలపాడు గ్రామంలో శుక్రవారం సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. గౌతు లచ్చన్న మనుమరాలు గౌతు శిరీష మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం ఐకమత్యంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో విగ్రహదాతలు కేవీ చలపతిరావు, కేసన భద్రాచలం, కేసన త్రినాథ్, మన్నె వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.



విగ్రహావిష్కరణలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, శిరీష

ఆకట్టుకున్న పురాతన నాణేలు, స్టాంపుల ప్రదర్శన

గుంటూరు ఎడ్యుకేషన్: ఎల్ఐసీ కాలనీలోని విజ్ఞాన్ పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన పురాతన నాణేలు, స్టాంపులు, వివిధ దేశాల కరెన్సీ నోట్లు ప్రదర్శన ఆకట్టుకుంది. ముఖ్య అతిథిగా గుంటూరు డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ యలమందయ్య పాల్గొని, ప్రదర్శన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆసక్తిని రేకెత్తించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ 100 దేశాల కరెన్సీ నోట్లు, 20 దేశాల వెండి నాణేలు, 60 దేశాల్లో మహాత్మాగాంధీ చిత్రంతో ఉన్న స్టాంపులు, జంతువుల బొమ్మలున్న నాణేలు, స్వాతంత్య్రం రాక మునుపున్న నాణేలు, ఆంధ్రప్రదేశ్‌లో ప్రముఖుల పేర్లతో వచ్చిన స్టాంపులు సేకరించి ఎగ్జిబిషన్ నిర్వహించినట్లు వివరించారు. పాఠశాలలో ఏటా ఇదే విధంగా ప్రదర్శన నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే విశ్రాంత ఉద్యోగి ఎం.వి.యస్. ప్రసాద్, తపాలాశాఖ ఇన్‌స్పెక్టర్ వై. మునిచంద్రారెడ్డి, పోస్టుమాస్టర్ వై. మాధవరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రదర్శనలో ఏర్పాటు చేసిన స్టాంపులు, కరెన్సీ నోట్లు

కోర్టు ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

సీనియర్ సివిల్ జడ్జి నాగరాజా

మంగళగిరి: కోర్టు ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సీనియర్ సివిల్ జడ్జి నాగరాజా అన్నారు. మంగళగిరి కోర్టు ప్రాంగణంలో శుక్రవారం స్వచ్ఛభారత్‌పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జడ్జి నాగరాజా మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రంగా ఉంచాలని ఉన్నత న్యాయస్థానం నుంచి ఆదేశాలు వస్తున్నప్పటికీ మంగళగిరి కోర్టుల పరిధిలో ఎక్కడ పడితే అక్కడ వ్యర్థాలు, వాటర్ బాటిల్స్ పడేయడం సరికాదని సూచించారు. కోర్టు ఆవరణ పరిశుభ్రంగా ఉండాలని, వ్యర్థాలు కనిపించకూడదని సిబ్బందిని ఆదేశించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్.వి. రామకృష్ణ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడరాదన్నారు. అది భూమిలో ఇంకాలంటే వందల సంవత్సరాలు పడుతుందని, ప్లాస్టిక్‌కు బైబై చెప్పాలని తెలిపారు. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి. శ్రీ ప్రత్యూష మాట్లాడుతూ కోర్టు ప్రాంగణంలో ఉమ్మి, వ్యర్థాలు వేసినా జరిమానా విధిస్తామని చెప్పారు. కోర్టు ప్రాంగణం పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆహ్లాదకర వాతావరణం ఉంటుందని తెలిపారు. పరిశుభ్రతకు విఘాతం కలిగించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో బార్ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జె. లెనిన్‌బాబు, బి. నాయుడమ్మ, ప్రతినిధులు తోట నరసింహారావు, కె. స్వరూపారాణి, టి. రాజ్యలక్ష్మి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



కోర్టు ఆవరణను పరిశీలిస్తున్న న్యాయమూర్తులు